క్లుప్తంగా

శాస్త్రోక్తంగా రుద్రహోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం

ఐ.పోలవరం: కార్తికమాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, రుద్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. శివుని జన్మనక్షత్రం కావడంతో ఆరుద్ర నక్షత్రం రోజున ప్రతినెల రుద్రహోమం నిర్వహిస్తారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హైందవ శంఖారావానికి తరలిరండి



హైందవ శంఖారావం కరపత్రాలతో భక్తులు

అమలాపురం టౌన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి హైందవులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక మహిపాల వీధిలో మహిళలతో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నాయుడు హైందవ శంఖారావం విశిష్టత గురించి వివరించారు. 'దేవాలయాలను పరిరక్షించుకుందాం' అనే నినాదంలో జరిగే ఈ శంఖారావ సభలో చర్చించే అంశాలను తెలియజేశారు. శంఖారావం సభకు సంబంధించిన కరపత్రాలను భక్తులకు అందజేశారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచండి

ముమ్మిడివరం: వీధి వ్యాపారులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మెప్మా రిసోర్స్ పర్సన్లకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం వంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించే యాప్‌లపై అవగాహన కల్పించాలన్నారు. స్వానిధి, స్వాభిమాన్ బి పథకాల గురించి కౌన్సిలర్లకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతి పథకం గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారి అభివృద్ధి పనులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పోలేకుర్రు పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పోలేకుర్రు వంతెన నుంచి తోటపేటకు వెళ్లే కాలువగట్టు రహదారి అధ్వానంగా తయారై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోయేవారు. ఈ రహదారి దుస్థితిపై పలుమార్లు సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించడం జరిగింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించడంతో గుంతల రహదారికి మోక్షం కలిగింది. గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు పర్యవేక్షణలో రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీజీటీల ఎంపిక జాబితా విడుదల

యానాం: యానాంతో పాటు మిగిలిన మూడు రీజియన్‌లలో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ లాంగ్వేజీ) ఎంపిక జాబితాను మంగళవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి ప్రియదర్శిని విడుదల చేశారు. తెలుగుభాష బోధనకు రామేశ్వరపు శాంతి(జనరల్), మేడా శైలజావాణి(ఎంబీసీ) ఎంపికయ్యారన్నారు. వెయిటింగ్ లిస్ట్‌లో సీహెచ్ లక్ష్మీకాంత కుమారి ఉన్నారన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై బైండోవర్

అమలాపురం టౌన్: అనధికారికంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న అయినవిల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు అమలాపురం ఎక్సైజ్ సీఐ వీవీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ ఇద్దరు నిందితులను అయినవిల్లి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరు పరచగా వారికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ కేసు నమోదు చేశారు.

రైతు చూపు.. ఆధునిక వ్యవసాయం వైపు!

- యంత్ర సాయంతో వరికోతలకే అన్నదాతల మొగ్గు
- కూలీలతో కోత చేపట్టిన దానికంటే పెట్టుబడి ఖర్చు మిగులు
- తక్కువ సమయంలో పనులు పూర్తి
- కళ్లాల వద్దే ధాన్యాన్ని అమ్ముకునే వెసులుబాటు



ఐ.పోలవరంలో యంత్ర సహాయంతో వరికోత



కాట్రేనికోనలో ఎండబెట్టిన ధాన్యం

ఐ.పోలవరం: అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్ వరికోతలు ప్రారంభమవుతున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం మండలంలో 7,600 ఎకరాలు, ఐ.పోలవరం మండలంలో 5,558 ఎకరాలు, కాట్రేనికోన మండలంలో 5,480 ఎకరాలు, తాళ్లరేవు మండలంలో 8,250 ఎకరాల్లో కలిపి మొత్తం 26,888 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది సాగు చేపట్టారు. అమలాపురం నియోజకవర్గ పరిధిలో ఉప్పలగుప్తం మండలంలో 4,481 ఎకరాలు, అల్లవరం మండలంలో 2,400 ఎకరాలు, అమలాపురం మండలంలో 3,500 ఎకరాల చొప్పున మొత్తం 10,381 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరిగింది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో 37,269 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేపట్టారు. అయితే సాగు ఆలస్యంగా ప్రారంభించడంతో ఇక్కడ కేవలం 7,946 ఎకరాల్లో మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయి. అత్యధికంగా తాళ్లరేవు మండలంలో 4,500ల ఎకరాల వరకు వరికోతలు జరిగాయి. మిగిలిన ప్రాంతాల్లో చాలా తక్కువగా కోతలు నెమ్మదిగా జరుగుతున్నాయి.

వాతావరణం సహకరించడంతో రైతులు యంత్రాలతో వరికోతలు చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సుమారు 80 శాతం పొలాల్లో రైతులు యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు. కూలీలతో అయితే వరికోత, నూర్పిడి, ధాన్యం ఎండబోత, ఆరబెట్టడం వంటి పనులకు గాను పెట్టుబడి ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతోంది. అదే యంత్రంతో అయితే ఎకరాకు ధాన్యం అరబెట్టేందుకు రూ.3వేలు, ఎండబోతకు మరో రూ.3 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు ఖర్చవుతోంది. ఈ కారణంగానే రైతులు అత్యధికంగా యంత్రాలతో కోతలకు ఆసక్తి చూపుతున్నారు. కేవలం గంటన్నర నుంచి రెండు గంటల వ్యవధిలో ఎకరం భూమిలో కోతలు పూర్తవుతుండడం, వచ్చిన ధాన్యాన్ని కళ్లాల వద్దనే అమ్మకాలు చేసుకునే వెసులుబాటు ఉండడంతో రైతులు యంత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు.

సులువుగా పనిపూర్తి

యంత్రాలతో కోతలు చాలా సులువుగా ఉంటోంది. ఇంతకు ముందు కూలీల వెతుకులాట, వారువచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చేది. సీజన్‌లో కూలీలకు సైతం ఖాళీ ఉండేది కాదు. ఇప్పుడు యంత్రాలు రావడం వల్ల కూలీల కొరత చాలా వరకు తగ్గింది. ఒక్క రోజులోనే నా భూమిలో నాలుగు ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి.

– గబ్బుల నారాయణ, రైతు, కేశనకుర్రు, ఐ.పోలవరం.

గడ్డి అవసరం లేని వారికి మేలు

వట్టిగడ్డి అవసరం లేని రైతులు చాలా మంది యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు. కానీ గడ్డికి సైతం అధిక ధర వస్తుండడంతో కొంతమంది కూలీలతో కోతలు కోయించి నూర్పుడులు చేయిస్తున్నారు. యంత్రాలు వచ్చిన తరువాత కూలీలపై పనిభారం చాలా వరకు తగ్గింది.

– పి.శ్యామల కుమార్, రైతు, మురమళ్ల, ఐ.పోలవరం మండలం.

నేత్రానందంగా మహా లింగార్చన



గొల్లవిల్లి భీమేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో మహిళలు



విలసవిల్లిలో శంఖాలతో మహా లింగార్చన

ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, విలసవిల్లి గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విలసవిల్లి గ్రామంలో పండితులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శంఖాలతో మహాలింగార్చనను ఘనంగా చేపట్టారు. గొల్లవిల్లి గ్రామంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు భైరవభట్ల వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యే ఫిర్యాదు

స్థానిక అధికారుల తీరుపై మండిపాటు



స్పీకర్ ఆర్ సెల్వంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని పేర్కొంటూ ప్రివిలేజ్ కమిటీ చైర్మెన్, స్పీకర్ ఆర్ సెల్వంకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విలేకరులకు తెలిపారు. వివిధ ప్రభుత్వ ఆహ్వాన పత్రాలు, అధికారిక కార్యక్రమాలకు సంబంధించిన వాటిపై స్థానిక శాసనసభ్యుడి హోదాలో ఉండాల్సిన తన పేరును సైతం వేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారి ఆర్ శ్రీనివాస్, డెలిగేట్ టు డీఈ, డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ అధికారులు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. ఎటువంటి హోదా లేని మల్లాడి కృష్ణారావును ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి ఆర్ఏఓ మునిస్వామి ఆహ్వానిస్తున్నారని అన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడ్డ శాసనసభ్యుల పట్ల ప్రొటోకాల్ పాటించాలనే కేంద్ర ఆదేశాలు ఉన్నా వాటిని ఉల్లంఘిస్తూ అధికారులు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాతకోరంగిలో వైభవంగా లక్షపత్రి పూజ



పాతకోరంగి కురంగేశ్వరుని సన్నిధిలో లక్షపత్రి పూజల్లో భక్తులు

తాళ్లరేవు: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా పాతకోరంగి గ్రామంలోని పురాతన శివాలయంలో మంగళవారం లక్షపత్రి పూజను వైభవంగా జరిపించారు. బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ నేతృత్వంలో కాకినాడకు చెందిన వేదపండితులు కురుకుల్ల సూర్యనారాయణ శిష్యబృందంచే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పారాయణ, గోపూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు, లింగార్చన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారికి లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్షార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



మల్లేశ్వరస్వామికి బిల్వపత్రాలతో అభిషేకం చేస్తున్న వేద పండితులు

అల్లవరం: కార్తికమాసం పురస్కరించుకుని అల్లవరంలో కొలువై యున్న ఉమా మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఉపద్రష్ట విక్రమాదిత్య ఆధ్వర్యంలో ఉమా సమేత మల్లేశ్వరస్వామికి బిల్వపత్రాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహా లింగార్చన, సూర్య నమస్కారాలు, రుద్రహోమం, సుందరకాండ పారాయణం, శాంతి కల్యాణ్యం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళలకు మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్: శ్రామిక మహిళలు పనిచేసే ప్రదేశాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని, వారికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. స్థానిక నల్ల వంతెన సమీపంలో గల ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన శ్రామిక మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్య నాయకురాలు మీసాల మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశం శ్రామిక మహిళల సమస్యలపై చర్చించింది. శ్రామిక మహిళల శక్తి రేటు పెరిగిందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంగా క్షేత్ర స్థాయిలో ఆ రేటు ఏమీ పెరగలేదని సత్తిబాబు గణంకాలతో వివరించారు. శ్రామిక మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి రాయుడు సుబ్బలక్ష్మి శ్రామిక మహిళల సమస్యలపై మాట్లాడి వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, శ్రామిక సమాఖ్య నాయకురాలు పోతుల సాయమ్మ తదితరులు ప్రసంగించారు.

పీఎం స్వనిధి రుణాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ, కమిషనర్ రాజు తదితరులు

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో పీఎం స్వనిధి, స్వాభిమానంపై పట్టణంలోని చిరు వ్యాపారులకు ఆ బ్యాంక్ అధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌బీఎమ్) కేశవవర్మ, కార్మిక అధికారి సత్యనారాయణ, ఐసీడీఎస్ అధికారిణి కేఎల్‌డీ కుమారి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 18 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ అన్ని బ్యాంకుల్లోనూ వీధి వ్యాపారులకు డిజిటల్ యాక్టివేషన్, పీఎం స్వనిధి రుణాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ తెలిపారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బాబు కర్రి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



ఉప్పలగుప్తంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



అమలాపురంలో విద్యార్థులకు పోటీలు

అమలాపురం రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అమలాపురం మండలం సవరప్పాలెం శాఖా గ్రంథాలయంయాధ్వర్యంలో సమనస శ్రీరామ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి మహిళా సాధికారత గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు, పిన్సిపాల్ లక్ష్మీగణేష్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయ శాఖల్లో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషు, మారిశెట్టి పద్మ భ్రమరాంబ, సలాది పుల్లయ్యనాయుడు, శాంతి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీవో శాంతలక్ష్మి

అల్లవరం: సభ్య సమాజంలో బహిరంగ మల విసర్జన చెడు విధానమని, దానిని ప్రతి ఒక్కరూ నిర్మూలించాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి అన్నారు. ప్రపంచ టాయిలెట్ డే పురస్కరించుకుని అల్లవరం పంచాయతీ పరిధిలో మరుగుదొడ్ల ఆవశ్యకతపై ఆమె మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత అల్లవరం, బోడసకుర్రు, గూడాల సచివాలయాల్లో తనిఖీలు నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఈఓపీఆర్డీ నాగేంద్ర, ఏఈ స్వామి, కార్యదర్శి రాజమోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులు సంఘటితం కావాలి



నూతన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సత్తిరాజు

అల్లవరం: ఆటో కార్మికులు సంఘటితం కావడం ద్వారా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి దోహద పడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు అన్నారు. అల్లవరం మండలం ఆటోవాలా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షునిగా చేగొండి పెద్దిరాజు, కార్యదర్శిగా యలగన ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా అయితాబత్తుల సురేష్, కోశాధికారిగా ఈతకోట బాలాజీ, సహాయ కార్యదర్శిగా కొల్లు వెర్రియ్య నియమితులయ్యారు.

పలుచోట్ల కార్తిక వనసమారాధనలు



ఉసిరి చెట్టు కింద కార్తిక పూజలు చేస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మెబర్లీ పేటలో కార్తిక వన సమారాధన మంగళవారం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత అక్షయపాత్ర అధ్యక్షురాలు పోతురాజు నాగ కనకదుర్గ ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు వద్ద కార్తిక పూజలు జరిగాయి. అంతకు ముందు గాయత్రీ సహిత వారాహి హోమం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని హోమం, కార్తికవన సమారాధన నిర్వహించినట్లు శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతు రామకృష్ణారావు తెలిపారు. అనంతరం అక్షయ పాత్ర, గోశాల సేవకులు కార్తిక వన సమారాధనలో పాల్గొని ఆత్మీయ వాతావరణంలో ఉసిరి చెట్టు నీడలో సహపంక్తి భోజనాలు చేశారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ కార్తిక వనసమారాధన

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండలం నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఆర్యవైశ్య సీనియన్ సిటిజన్స్ కుటుంబ సమేతంగా పాల్గొని ఆత్మీయత, సంఘటితాన్ని చాటారు. తొలుత అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ ఉసిరి చెట్టుకు కార్తిక పూజలు చేసి వనసమారాధన వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆరు పదుల వయస్సు దాటిన సీనియర్ సిటిజన్స్ కుర్రాళ్లలా పలు ఆటలు ఆడారు. మహిళా సీనియర్ సిటిజన్స్ పాటలు పాడి అలరించారు. అనంతరం అంతా సహపంక్తి భోజనాలు ఆత్మీయ వాతావరణంలో చేసి సందడి చేశారు. ఇటీవల రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్ కంకటాల రాంబాబును అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించి అభినందించారు.

హెర్బల్ మొక్కలతో ఆరోగ్యానికి మేలు



హెర్బల్‌ప్లాంట్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న డీవైఈవో సూర్యప్రకాశం

అమలాపురం రూరల్: హెర్బల్ మొక్కల పెంపకం ద్వారా వివిధ రకాల వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం అన్నారు. అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశాన్ని ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల అభ్యసనా కృత్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఏర్పాటు చేసిన హెర్బల్ ప్లాంట్ గార్డెన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అటల్ టెకరింగ్ ల్యాబ్‌లో తయారు చేసిన బొమ్మలు, నామ ఫలకాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ సత్యనారాయణ, పాఠశాల సముదాయ జాయింట్ సెక్రటరీ బద్రి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడి వార్షికోత్సవం



పూలతో అలంకరించిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం

అమలాపురం రూరల్: నల్లమిల్లి గ్రామంలో కృష్ణదేవ రాయ వీధిలో వేంచేసి యున్న లక్ష్మీనారాయణస్వామి 14వ కల్యాణ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి స్వామివారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. అనంతరం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నులపండువగా త్రయంబకేశ్వరుని కల్యాణం




స్వామివారికి పూజలు చేస్తున్న పండితులు

అమలాపురం రూరల్ : మండలంలో పాత బండారు లంకలోని భువనేశ్వరీ సమేత త్రయంబ కేశ్వరస్వామి దివ్య కల్యాణం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. దైవపు కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. హాజరైన మహిళల కాళ్లకు పారాణి రాసి గాజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో జరిగింది.

కాపు సమారాధనకు రూ.2 లక్షల విరాళం

అమలాపురం టౌన్: అమలాపురంలో బుధవారం జరగుతున్న కాపు కార్తిక వనసమారాధకు రియల్ ఎస్టేట్ అండ్ బిల్డర్స్ అసోసియేషన్‌లోని కాపు ప్రతినిధులు రూ.2 లక్షలు విరాళంగా సమకూర్చారు. ఈ విరాళాన్ని కాపు నాయకుడు మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడికి అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం అందజేశారు.

డయాబెటిక్ టెస్ట్ కిట్‌ల పంపిణీ



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మేడో ఫార్మా ప్రతినిధులు

తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామంలో రోగులకు స్థానిక వైద్యుడు వీఆర్ఎన్‌బీ ప్రసాద్ ఆధ్వర్యంలో టెస్టింగ్ కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ నెల 14న వరల్డ్ డయాబెటిస్ డేను పురస్కరించుకుని రోగులకు షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో షుగర్‌వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన 50 మందికి సుమారు రూ.1200లు విలువచేసే కిట్‌లను మేడో ఫార్మా సహకారంతో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడో ఫార్మా ప్రతినిధి షణ్ముఖ సురేష్, రవితేజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

అమలాపురం టౌన్: దేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ జయంతి వేడుకలను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అమలాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హైస్కూలు సెంటర్‌లో గల ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పీసీసీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, జిల్లా పార్టీ మహిళా నాయకురాలు మహ్మద్ షకీలా తదితరులు ఇందిరాగాంధీకి నివాళులర్పించారు.